క్లుప్తంగా

ముగ్గురిపై కేసు నమోదు

కమలాపూర్ : మండలంలోని భీంపల్లికి చెందిన బచ్చల సిద్ధు, బచ్చల బన్నీ, కమలాపూర్‌కు చెందిన వెంగళ విజయ్ అనే ముగ్గురితో పాటు మరి కొందరిపై శనివారం దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11వ తేదీన భీంపల్లికి చెందిన పిట్టల అనిల్‌కుమార్ తన అల్లుడు సులుగూరి కుమారస్వామితో కలిసి భీంపల్లి బస్టాండ్ వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో సిద్ధు, బన్నీ, విజయ్ వారి స్నేహితులు మరికొందరితో కలిసి అనిల్ కుమార్, కుమారస్వామిపై దాడి చేసి చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు సిద్ధు, బన్నీ, విజయ్‌తో పాటు మరికొందరిపై దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

మోరీలో పడి యువకుడి దుర్మరణం

ఆత్మకూరు : ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు మోరీలో పడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తంగళ్లపల్లి చరణ్ (26) కొంత కాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి సమీపంలో ఉన్న కమ్మరికాల్వ మోరీ వద్ద గద్దెపై కూర్చున్నాడు. ఈ క్రమంలో అతడికి ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా మోరీలో పడగా తలకు గాయం అయ్యింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. ఫిట్స్ రావడంతో మోరీలో పడడం వలన తలకు గాయమై మృతిచెందినట్లు భావిస్తున్నామని మృతుడి బావ పొదిల రాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



నడికూడ : తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలంలోని కంఠాత్మకూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి 5వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా 8 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాచర్ల భిక్షపతి తెలిపారు.

'గ్యాస్ ధర పెంపు సరికాదు'



పర్వతగిరి : వంట గ్యాస్ ధర పెంపు సరికాదని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ అన్నారు. గ్యాస్, చమురు ధరల పెంపును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు, సంపన్నులకు రాయితీలిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. నిత్యం ప్రజలపై భారాలు మోపుతున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. సూపర్‌పవర్‌గా మారుస్తామని ప్రగల్భాలు పలికి దేశాన్ని పాతాళానికి తొక్కేస్తున్నారని ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలు వెంటనే తగ్గించకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాల్సిందేనని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్, మండల ఉపాధ్యక్షుడు మూడు దేవరాజ్, నాయకులు బొట్ల కుమార్, అనిల్, చిన్నపెల్లి శ్రావణ్, బొట్ల రమేశ్, లోకేశ్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీడీఓ మృతి



మహబూబ్ హుస్సేన్ (ఫైల్)

మొగుళ్లపల్లి: స్థానికంగా ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ మహబూబ్ హుస్సేన్(61) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం హనుమకొండ జిల్లా పరకాల అయినప్పటికీ కుటుంబ అవసరాల రీత్యా హనుమకొండ పట్టణంలో నివాసముంటూ విధులకు హాజరయ్యేవారు. విధి నిర్వహణలో బాధ్యతయుతంగా ఉంటూ.. ప్రజలందరికీ అందుబాటులో ఉండేవారని పేరుంది. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయనుండగా.. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందడం అందరినీ కలిచివేసింది. ఆయన మృతిపై కార్యాలయ సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.

భానుడి భగభగ

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో జనం విలవిల
- శీతలపానీయాలు, కూలర్ల దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ



మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన పరకాల రహదారి

పరకాల : భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రాత్రి వేళల్లో చల్లగా ఉంటూనే మధ్యాహ్నం 11 దాటగానే ఊహించనిరీతిలో ఎండలు మండుతున్నాయి. వడగాలి వీస్తుండటంతో చాలా మంది పనిచేసే ప్రాంతాలు, కార్యాలయాలు, ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినప్పటికీ ఎండకు తట్టుకోలేక శీతలపానీయాలు తీసుకోవడం, చలివేంద్రాల వద్దకు పరుగులు పెడుతున్నారు. దీంతో ఆయా శీతలపానీయాల పాయింట్లు రద్దీగా కనిపిస్తున్నాయి. విధులు, ఇతరత్రా పనుల్లో బయటకు వెళ్లి ఇళ్లకు చేరుకునేవారు ఇంట్లో ఉడుకపోత భరించలేక ఉపశమనం కోసం కూలర్స్, రిఫ్రిజిరేటర్స్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆయా దుకాణాలు వినియోగదారులతో కలకలలాడుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నీరు ఎక్కువగా తాగాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని అంటున్నారు. వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు జాగ్రత్తలు పాటించాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం ఇంట్లో ఉండే విధంగా చూసుకోవాలని సూచిస్తున్నారు. చిన్నారులు ఎండలో తిరుగొద్దని, అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.



కొనుగోలుదారులతో రద్దీగా మారిన ఎలక్ట్రానిక్స్ దుకాణం



చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకుంటున్న వృద్ధుడు



పుచ్చకాయ తీసుకెళ్తూ..

11 దాటితే కష్టమే..



నా వయస్సు ప్రస్తుతం 65కు పైగా ఉంటుంది. పుట్టినప్పటి నుంచి ఏనాడు కూడా ఏప్రిల్ మొదటి వారంలో ఇంత ఎండ చూడలేదు. నీళ్లు తాగితే, ఊపిరి పీల్చుకున్నట్లు అవుతుంది. పరకాలకు ఓ పనికోసం వస్తే దాహం అవుతుంటే చలివేంద్రంలో నీరు తాగాను. అప్పుడు కొద్దిగా ఉపశమనం కలిగింది. మా లాంటి వృద్ధుల కోసం గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- నర్సయ్య, చెన్నాపురం

పుచ్చకాయలు కొనాల్సివస్తోంది



ఎండకు తట్టుకోలేక ఇంట్లో పిల్లలతో కలిసి తినేందుకు ధర సంగతి ఏమో గానీ ఓ పుచ్చకాయ కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాను. వ్యవసాయ పనుల వద్దకు వెళితే ఎండకు ప్రాణం పోయినట్లు అవుతుంది. అందుకే పుచ్చకాయ కొనుక్కోని ఇంటికి వెళ్తున్నాను. ఎండలకు బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది. మే నెలలో ఎలా ఉంటాయో అర్థం కావడం లేదు.

- సంతోశ్, మల్లక్‌పేట

కూలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ శారద

దామెర : ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని ఊరుగొండలో చేపల చెరువు నిర్మాణ పనులకు వచ్చిన ఊరుగొండ, దుర్గంపేట్, ఒగ్లాపూర్ కూలీలకు కూలీ రేట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజుకు రూ.307 చొప్పున 100 రోజులు పనిచేసి రూ.30,700 పొందాలని అన్నారు. ప్రతి గ్రామంలో 70 నుంచి వంద మంది కూలీలు పనులకు హాజరు కావాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, కూలీలు తదితరులు ఉన్నారు.

సఖి సేవలు వినియోగించుకోవాలి

కమలాపూర్ : సఖి వన్ స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. మండలంలోని నేరెళ్లలో ప్రగతి పరస్పర సహాయక పొదుపు సంఘం కార్యాలయంలో సఖి సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళల కోసం అమలు చేస్తున్న చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి వాటి నుంచి రక్షణ పొందేందుకు సఖి సెంటర్ పని చేస్తోందన్నారు. సమస్య ఎదురైనప్పుడు ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు కాల్ చేస్తే తక్షణ సాయం, రక్షణ లభిస్తుందన్నారు. అదే విధంగా 0870 2452112, 7382983088 నంబర్లకు కాల్ చేస్తే బాధిత మహిళలకు సాయం అందిస్తారన్నారు. సఖి కేస్ వర్కర్లు భారతి, అనసూర్య, కవిత, శాంత, స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు : హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో మండలంలోని గుడెప్పాడ్‌లో గల హనుమాన్ దేవాలయం నుంచి మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వరకు శుక్రవారం వీరహనుమాన్ బైక్‌ర్యాలీ, శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ నామస్మరణ, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ శోభాయాత్ర చేపట్టారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా పండుగ వాతావరణం నెలకొంది. హిందూ ధర్మరక్షణ స మితి ప్రతినిధులు, బీజేపీ నాయకులు,పాల్గొన్నారు.

సన్నబియ్యంతో ఎమ్మెల్యే సహపంక్తి భోజనం

శాయంపేట : పేదలందరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన మారేపల్లి సమ్మయ్యకు ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని లబ్ధిదారుడి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన భోజనం చేశారు. సన్నబియ్యం పంపిణీతో పేదవారి కళ్లలో ఆనందాన్ని స్వయంగా చూశానని అన్నారు. స్వయంగా సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. దేశ చరిత్రలో సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతీ తెల్ల రేషన్‌కార్డుదారుడు వినియోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడికి దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమ్మయ్య కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



పరకాల : ప్రజలను అద్దాలతో నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రభుత్వ భూములను విక్రయిస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన గావ్‌చలో–బస్తీచలో కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గావ్‌చలో–బస్తీచలో ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో పలు సంఘాల నాయకులను కలిసి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నట్లు చెప్పారు. నేటి నుంచి 26వ తేదీ వరకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను విక్రయించి పాలన కొనసాగించాలనుకోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు మహిళల కోసం అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల విధానాలు ఒక్కటేనని ప్రజలకు అర్థమైందని, అందుకు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నిరంజన్, నాయకులు ఆర్‌పీ జయంత్‌లాల్, బెజ్జంకి పూర్ణచారి, రామన్న, రాజభద్రయ్య, విజేందర్‌రావు, రాజవీర్, భిక్షపతి, తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్, సంఘ పురుషోత్తం, శారద పాల్గొన్నారు.

మూడు రోజులుగా సర్వర్ డౌన్

శాయంపేట : రాజీవ్ యువ వికాసం పథకం ఆన్‌లైన్ అప్లికేషన్ సర్వర్ మూడు రోజులుగా పని చేయడంలేదని, దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజలు వారి పనులను పక్కనబెట్టి రాజీవ్ యువ వికాసం పథకం అప్లికేషన్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సెంటర్‌ల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కానీ సర్వర్ డౌన్ ఉండడంతో చాలా మంది అప్లికేషన్లు ఇంకా ఆన్‌లైన్ కాలేదని తెలిపారు. ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం



శాయంపేట : డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి స్పష్టం చేశారు. మైలారం, హుస్సేన్‌పల్లి గ్రామాల్లో శనివారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించుకుందామని ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. చక్రపాణి, రవీందర్, రవి, కుమారస్వామి, డీటీ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రాజిరెడ్డి, జంగారెడ్డి, ఐలయ్య, సాంబయ్య, సర్సయ్య పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- పెట్రోల్‌బంక్, సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- రైతులను ఇబ్బందులకు గురిచేసే మిల్లర్లను ఉపేక్షించం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మండల సమాఖ్యలకు బస్సులను అందించి ఆర్టీసీకి లీజుకు ఇస్తున్నట్లు చెప్పారు. మండల సమాఖ్యకు పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్ మంజూరు చేశామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాలకు అత్యధిక సంఖ్యలో కేటాయించమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏమైన అవకతవకలు, అవినీతి జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం సురేఖ మండల సమాఖ్యకు రూ. 1కోటి 59లక్షల 60వేల వడ్డీలేని రుణాల జంబో చెక్కును ఆయన అందించారు. డీఆర్డీఓ శ్రీను, ఆర్డీఓ నారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, డీటీ ప్రభావతి, బ్యాంకు లింకేజీ డీపీఎం దాసు, బ్యాంకు లింకేజీ ఏపీఎంలు శ్రీధర్‌రెడ్డి, రాజు, ఏపీఓ అనిత, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ మెంబర్ చంద్రప్రకాశ్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు చక్రపాణి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, రవి, కట్టయ్య, కృష్ణమూర్తి, రాజేందర్ ,వరదరాజు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ మోసం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజయ్య

వేలేరు : ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామంలో ప్రతీ పార్టీకి సభలు నిర్వహించుకునే హక్కు ఉంటుందని, దానికి విరుద్ధంగా రజతోత్సవ సభకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా అడ్డుకుంటుందని, అనుమతులు ఇవ్వకున్నా సభను నిర్వహిస్తామని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరిది ఐరన్ లెగ్ అని, దేవాదుల వద్ద కాలుపెట్టగానే మోటార్లు పనిచేయడం లేదని విమర్శించారు. సమయానికి సాగునీరు విడుదల చేయక పోవడంతో దేవాదుల కింద సాగవుతున్న వేలాది ఎకరాల పంటలు ఎండిపోయాయని అన్నారు. దేవునూర్ గ్రామంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి బీనామీల పేరుతో భూములు ఉన్నాయని, నిరూపించడానికి తాను సిద్ధమన్నారు. బీనామీ పేరుతో ఇనుపరాతి గుట్టలను ఆక్రమించుకునేందుకు ఎమ్మెల్యే శ్రీహరి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అనంతరం పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల కోఆర్డీనేటర్ సురేశ్, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, రవీందర్, వీరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం కల్పించే మద్దతు ధర పొందాలి

- డీపీఎం ప్రకాశ్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం ప్రకాశ్

ఎల్కతుర్తి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని డీపీఎం ప్రకాశ్ సూచించారు. శనివారం మండలంలోని కేశవాపూర్, దామెర, దండేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 చెల్లిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని అన్నారు. అలాగే 17శాతం తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, సీసీలు రవీందర్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సుకినె సంతాజీ, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణికి సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

దామెర : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ అశోక్‌బాబు అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో పోషణమాసాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న బాలామృతంలో పుష్కలంగా పోషకాలు ఉన్నాయని, బాలబాలికలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వాణి, రమ, నిరీక్షణ, ఆశ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న రెడ్‌క్రాస్ డాక్టర్లు

దామెర : బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ కిషన్‌రావు, మహ్మద్ తయార్‌మసూద్ సూచించారు. మండలంలోని ల్యాదెళ్ల రూరల్ హెల్త్ సెంటర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 56 మందికి బీపీ, షుగర్ రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యాధిగ్రస్తులు నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల సలహాలు పాటిస్తు మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది గుల్లెపల్లి శివకుమార్, గంగాధర్, సురేశ్, శ్రీకాంత్, నర్సింహ, పోశాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఓదార్పు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన తోట లింగమూర్తి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి శనివారం లింగమూర్తి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లింగమూర్తి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.